RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 316 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 19 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# విస్తరణకు వేళాయె!

## కొత్తగా మంత్రివర్గంలో ఆరుగురికి ఛాన్స్!!

## భారీ స్థాయిలోనే పోటీ!!

హైదరాబాద్ : తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో కేబినేట్ విస్తరణపై సస్పెన్స్ నెలకొన్నది. ఖాళీగా ఉన్న ఆరు బెర్త్‌లను ఎప్పుడు భర్తీ చేస్తారోనని చాలా మంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. అయితే గతంలో లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే కేబినేట్ విస్తరణ ఉంటుందని టీపీసీసీ నేతలు ప్రచారం చేశారు. దీంతో ఆశావహులు, సీనియర్లు ఆ మంత్రి పదవుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. సీఎంతో పాటు ఢిల్లీలో ఉండే పెద్దలనూ కలిసేందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎంతో కలిపి 12 మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరు బెర్త్‌లు ఖాళీగా ఉన్నాయి. వీటిని జిల్లాలు, క్యాస్ట్ ఈక్వేషన్‌ను పరిగణలోకి తీసుకొని భర్తీ చేస్తామని గతంలోనే సీఎం హామీ ఇచ్చారు. కానీ, ప్రస్తుతం కేబినేట్ విస్తరణపై సీఎం, హైకమాండ్ నుంచి ఎలాంటి స్పందన లేదు. సీనియర్ ఎమ్మెల్యేలు మాత్రం మినిస్టర్ పోస్టుల కోసం గట్టిగానే ట్రై చేస్తున్నారు.

ప్రస్తుతం పనిచేస్తున్న కేబినేట్ కూర్పులో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు ప్రతినిధ్యం లేదు. దీంతో ఈ జిల్లాలకు అవకాశం కల్పిస్తూనే, సామాజిక వర్గాల వారీగా భర్తీ చేయనున్నారు. ప్రధానంగా బీసీ, ముదిరాజ్, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది.

**ప్రాతినిధ్యం కోసం పోటీ :** కేబినేట్‌లో నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున మంత్రులుండగా ఖమ్మం నుంచి ఏకంగా ముగ్గురు మినిస్టర్లు ఉన్నారు. మహబూబ్‌నగర్‌లో సీఎంతో పాటు మరొక మంత్రి ఉండగా, మెదక్ జిల్లాలో ఒక మినిస్టర్ ఉన్నారు. ఇక హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవ్వరూ లేకపోవడంతో బీఆర్ఎస్ నుంచి చేరిన సీనియర్ శాసన సభ్యులకు మినిస్టర్ పదవి ఆఫర్ చేసే అవకాశం ఉన్నది. రంగారెడ్డి నుంచి పరిగి ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు.

నిజామాబాద్, ఆదిలాబాద్‌లోనూ సీనియర్ నేతలు ఇద్దరూ తమకే అవకాశం ఇవ్వాలంటూ హైకమాండ్ ముందు ప్రపోజల్ పెట్టినట్లు తెలిసింది. మరోవైపు ఇప్పటికే సీఎంతో కలిపి ఏడుగురు ఓసీ, ఇద్దరు బీసీ, ఇద్దరు ఎస్సీ, ఒకరు ఎస్టీ సామాజిక వర్గం నుంచి కేబినేట్‌లో ఉన్నారు.

మైనార్టీ వర్గానికి స్థానం లభించకపోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంత్రి పదవులు పెంచే చాన్స్ ఉన్నదని ఆయా లీడర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఏం చేద్దాం? :** కేబినేట్ విస్తరణపై మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సీఎం అభిప్రాయాలను తీసుకునే అవకాశం ఉన్నది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన తర్వాత చేద్దామా? లోక్ సభ ఎన్నికల ఫలితాల అనంతరం భర్తీ చేద్దామా? అంటూ ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. దాని ప్రకారమే కేబినేట్ విస్తరణకు చాన్స్ ఉంటుందనేది పార్టీ వర్గాలు ఆఫ్ ది రికార్డులో చెబుతున్నాయి.




## అన్నా.. ఎవరు గెలుస్తరే..?

హైదరాబాద్ : ప్రభుత్వ కార్యాలయాలు.., ప్రైవేట్ సంస్థ లు.., నలుగురు ఎక్కడ కలిసినా ఒకటే చర్చ. అన్నా, ఎన్నికలు ఎలా జరిగాయి..? ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి..? ఏ నియోజకవ ర్గంలో ఎవరు గెలువబోతున్నారు..? ఏ పార్టీకి ఎన్ని స్థానాలొస్తాయి..? సాధారణ పౌరుల నుంచి ఉన్నతాధికారుల వరకు రాజకీయాలపై ఆసక్తి ఉన్న చాలామంది ఎన్నికల ఫలితాలపై ఆరా తీస్తున్నారు. ఎక్కడ ఎవరు గెలిచే అవకాశముంది..? ఫలానా అభ్యర్థి పరిస్థితి ఏంటి..? ఏ నియోజకవర్గంలో ఏ పార్టీల మధ్య పోటీ ఉందన్నది చర్చిస్తున్నారు. ఇందులో కొందరు సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇంకొందరు తమకు తోచిన అభిప్రాయం చెబుతున్నారు. స్నేహితులు, బంధువులకు ఫోన్ చేసి మీ దగ్గర ఏ పార్టీ గెలిచే అవకాశం ఉంది..? మీరెవరికి ఓటు వేశారని తెలుసుకుంటున్నారు. ప్రముఖులు పోటీ చేస్తోన్న నియోజకవర్గాలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రధానం గా సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, భువనగిరి, మహబూ బ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో ఫలితం ఎలా ఉండబోతుందన్న దానిపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో హోరాహోరీ పోరు ఉ ండడం.. సీనియర్ నేతలు పోటీ చేస్తుండడంతో గెలుపు ఎవరిదన్నది ప్రధా నంగా చర్చిస్తున్నారు. ఇక ఏపీ ఎన్నికలు.. అక్కడి హింసాత్మక ఘటనలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఎన్నికలంటే ఇంత హింస జరుగుతుం దా..? ఇదేం వైపరీత్యం అని పలువురు పేర్కొంటున్నారు. కేంద్రంలో ఏ కూటమికి అవకాశం ఉంది..? ఉత్తర భారతదేశంలో ఏ పార్టీకి సీట్లు ఎక్కువగా వస్తాయి..? ఎవరికి తగ్గుతాయి..? దక్షిణాదిన తీర్పు ఎలా ఉ ండబోతుందన్న దానిపై ఎవరికి వారు అభిప్రాయం వెల్లడిస్తున్నారు. మొత్తంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై చర్చ జోరుగా సాగుతోంది.


## పార్లమెంట్‌స్థానం గెలుపుపై ఎవరి ధీమాలో వారు

### ఎన్నికలు ముగిసిన పార్టీల మధ్య ఆగని లొల్లి

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఈ సారి చరిత్రలో నిలిచిపోనున్నాయి. ఎప్పుడు భిన్నమైన తీర్పునిచ్చే ఓటర్లు ప్రస్తుత ఎన్నికల్లో ఎవరి వైపు మొగ్గు చూపారనేది అభ్యర్థులను టెన్షన్ పుట్టిస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ చరిత్రలోనే అన్ని విషయాల్లో ఈ ఎన్నికలు ప్రత్యేకతను కనబర్చాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది మొదలు అభ్యర్థి ఎంపిక.. ఓటింగ్ ప్రక్రియ వరకు పార్లమెంట్ పరిధిలో ఆయా పార్టీల్లో ఏదో ఒక్క కొత్తదనం కనిపించింది. ప్రధాన పార్టీలు ఈ సారి ముగ్గురు ఆదివాసీలను బరిలో దించడం మొదటిసారి కాగా.. అందులో కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళ అభ్యర్థి పోటీ చేయడం ఇదే తొలిసారి. ఇలా అభ్యర్థుల ఎంపికనే కాదు.. ఇప్పుడు ఈ ముగ్గురిలో ఎవరు గెలిచిన అదొక సంచలనంగా మారనుంది. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జిల్లాలో సైతం పార్లమెంట్ ఎన్నికల సమయానికి రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు ముగియడంతో ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మూడు పార్టీలు సైతం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండగా, మెజార్టీ ఎంత వస్తుందనే దానిపై సైతం చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆయా బూత్ ల వారీగా ఓటర్ల ఎటువైపు మొగ్గు చూపారనే దానిపై పార్టీలు కింది స్థాయి కార్యకర్తలతో రిపోర్టు తెచ్చుకొని ఆరా తీస్తున్నారు.

**ఎన్నికలు ముగిసిన పార్టీల మధ్య ఆగని లొల్లి..** ఇదిలా ఉంటే ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ముగిసి నాలుగు రోజులు గడుస్తున్న రాజకీయ పార్టీల మధ్య లొల్లి ఆగడం లేదు. ఎన్నికల తర్వాత మూడు పార్టీలు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి తామే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేశాయి. మూడు పార్టీలు కూడా తాము లక్ష మెజార్టీతో విజయం సాధిస్తున్నామంటూ చెప్పుకొచ్చాయి. ఈ క్రమంలోనే ఆయా పార్టీల నేతలు ఎన్నికల ప్రచారం విషయంలో ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలు తీవ్ర వివాదానికి దారితీశాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి ఆ పార్టీ మాజీ నేతలు సుజాత సంజీవ రెడ్డిలు బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయంటూ ఆయన చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం లేపాయి. తమ మున్నూరు కాపు మహిళ సుజాత పట్ల అనుచితంగా మాట్లాడి కించపర్చారంటూ కంది శ్రీనివాస్ కు వ్యతిరేకంగా మున్నూరు కాపులు నిరసన తెలిపారు.

అటు కాంగ్రెస్ శ్రేణులు సైతం మాజీ నేతలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాయి. ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూ కబ్జాలకు పాల్పడుతున్నారంటూ కంది తీవ్రమైన ఆరోపణలు చేయడం హాట్ టాపిగ్ గా మారింది. అటు మాజీ ఎమ్మెల్యే జోగురామన్న సైతం బీజేపీ కాంగ్రెస్ లపై విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు డబ్బులు, మద్యం వెదజల్లాయంటూ ఆరోపణలు చేశారు. బీజేపీ నేతలు





ఎన్నికల కోసం వ్యాపారుల నుంచి వసూళ్లు చేశారంటూ విమర్శలు చేశారు. ఇలా పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయా పార్టీల మధ్య గొడవలు రాజకీయ దుమారాన్ని లేపుతున్నాయి.

**ఎవరు గెలిచిన చరిత్రే..** ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ముగ్గురు అభ్యర్థుల రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్నాయి. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన ఆత్రం సుగుణ గెలిస్తే ఆదిలాబాద్ మొదటి మహిళ ఎంపీ గానే కాకుండా పోటీచేసిన మొదటి సారే గెలిచిన నేతగా నిలుస్తారు. ఇదిలా ఉ ంటే 1989 లో గెలిచిన కాంగ్రెస్ ఆ తర్వాత 1991లో ఉప ఎన్నికలు రావడంతో టీడీపీ గెలిచింది. అప్పటి నుంచి 18 ఏళ్లు కాంగ్రెస్ ఎంపీ స్థానాన్ని గెలవలేదు. మళ్లీ 2008 ఉప ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఏడాది పాటు మాత్రమే కొనసాగింది. ఆ తర్వాత 2009 టీడీపీ, 2014 బీఆర్ఎస్, 2019 లో బీజేపీ గెలిచాయి. ఇప్పుడు కాంగ్రెస్ గెలిస్తే 15 ఏళ్లకు పదవి దక్కించుకొని చరిత్రలో నిలిచిపోనుంది. మరోపక్క బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ గెలిచిన చరిత్రే కానుంది. 20 ఏళ్ల నుంచి ఆదిలాబాద్ ఓటర్లు ఏ పార్టీకి రెండు సార్లు వరుసగా విజయాలు ఇవ్వలేదు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీ బీజేపీదే కావడం.. ఒకవేళ ఎన్నికల్లో గెలిస్తే 20 ఏళ్ల చరిత్రను తిరగరాయనుంది. ఇదే కాకుండా 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ లో చేరిన సోయం ఎంపీగా గెలిచారు. ఇప్పుడు గొడం నగేశ్ సైతం బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి ఎంపీ గా పోటీలో నిలిచారు. ఒకవేళ గెలిస్తే పార్టీలో చేరిన వెంటనే గెలిచిన అభ్యర్థిగా నగేశ్ మిగిలిపోతారు. అటు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సక్కు సైతం రెండు సార్లు ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఈ సారి బీఆర్ఎస్ నుంచి మొదటి సారి ఎంపీగా పోటీ చేశారు. దీంతో సక్కు గెలిచినప్పటికి మొదటి ప్రయత్నంలోనే ఎంపీ అయిన రికార్డులోకి ఎక్కుతారు. ఇలా ఈ సారి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలు మొత్తం కూడా చరిత్రలో లిఖించదగ్గ ప్రత్యేకతను చాటుకోనున్నాయి.

# ఉత్తర భారతంలో 'వేడి'

## మరో మూడువిడతల ఎన్నికలపై ఫోకస్




## అన్నీ ఉత్తర భారత్‌లోని స్థానాలకే!

నాలుగు విడతల్లో 23 రాష్ట్రాల్లో 379 స్థానాల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తయింది. మిగిలిన స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 20న ఐదో విడత, 25న ఆరో విడత, జూన్ 1న ఏడో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఇవన్నీ ఉ త్తర భారత్‌లోని స్థానాలే. మూడు విడతల ఎన్నికల్లో ప్రతిష్టాత్మక స్థానాలుండడంతో నేతలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 20న ఐదోవిడత ఎన్నికలు జరగనున్నాయి. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. యూపీలో 14 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. వాటిలో కాంగ్రెస్ కీలకంగా భావించే రాయబరేలి, అమేథి ఉన్నాయి. రాయబరేలిలో రాహుల్ గెలుపును కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. చివరి జాబితాలో రాహుల్ ను అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది.

**ఎక్కువ సీట్లే లక్ష్యంగా బీజేపీ ప్రచారం :** అమేథి నుంచి గాంధీ కుటుంబం నమ్మిన బంటు కిశోరీలాల్ శర్మ బరిలో ఉన్నారు. రాహుల్, కేఎల్ శర్మ గెలుపుతో యూపీలో తిరిగి పూర్వవైభవం పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. మరోవైపు బీజేపీ మాత్రం కాంగ్రెస్‌కు కీలకమైన ఈ రెండు స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేసేందుకు సకలశక్తులనూ మోహరిస్తోంది. హిందూ-ముస్లిం రాజకీయ ప్రభావం అధికంగా ఉ ంటుందని భావించే ఉత్తరప్రదేశ్‌లో గత ఎన్నికల్లోలానే వీలయినన్ని ఎక్కువ సీట్లు పొందాలన్నది బీజేపీ ఉద్దేశం. అందుకే యూపీ ప్రచారంలో ప్రధాని ఈ అంశాన్ని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమయింది. వారణాసిలో నామినేషన్ సమయంలోనూ ఈ అంశంపైనే ప్రధాని ఎక్కువగా దృష్టిపెట్టారు. ఆరో విడత లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 25న 57 స్థానాలకు జరుగుతాయి. ఏడు రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 57 స్థానాలకు జూన్ 1న ఏడోవిడతలో ఎన్నికలు జరుగుతాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే.. ఈ సారి మతం చుట్టూ ఎన్నికల ప్రచారం ఎక్కువగా సాగుతోంది. హిందూ-ముస్లిం రాజకీయంపై ప్రధాని ఆరోపణలు, కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు ఇస్తున్న కౌంటర్లు ఓటింగ్ శాతాన్ని ప్రభావితం చేసే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలపై కాకుండా CAA, అయోధ్య రామమందిరం, మత పరమైన రిజర్వేషన్లు, మతప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపు వంటివి ప్రచారాస్త్రాలుగా మారడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకాకముందే బీజేపీ గెలుపుపై ధీమాగా ఉంది. వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతున్నామని చెబుతున్న ప్రధాని..మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే చేయాల్సిన పనులపై వందరోజుల బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకున్నారు. కూటమిగా 400, సొంతంగా 370 గెలవాలన్నది లక్ష్యంగా బీజేపీ ప్రకటించుకుంది. మరోవైపు కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి నేతలు.. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన స్థాయిలో బీజేపీకి సీట్లు రావని ప్రచారం చేస్తున్నారు. ఎండలతో పాటు ఇతర ఏ కారణాలు ప్రభావం చూపాయో తెలియదు కానీ..మొదటి, రెండు, మూడు విడతల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదయింది. నాలుగో విడతలో మాత్రం పరిస్థితి మెరుగుపడింది. ఐదు, ఆరు, ఏడు విడతల్లో వీలయినంత ఎక్కువమంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా చేసేందుకు నేతలు వ్యూహాలు రచిస్తున్నారు.

**ఎన్నికల హామీలతో కాంగ్రెస్ ప్రచారం :** ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే.. ప్రతి మహిళ ఎకౌంట్లో నెలకు 8వేల 50 0 జమచేస్తామని ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారు. ఇది మహిళా సాధికారికతకు దారితీస్తుందని అంటున్నారు. మరోవైపు NDA తరపున ప్రధాని అభ్యర్థిగా మూడోసారి మోదీనే ఉండగా.. అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. NDA కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే మోదీ ప్రధానిగా ఎక్కువకాలం ఉండరని, అమిత్ షాను ప్రధానిని చేస్తారని, బీజేపీ రాజకీయాల నుంచి యోగీ ఆదిత్యనాథ్, శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు కొందరు కీలక నేతలు కనుమరుగవుతారని ప్రచారం చేస్తున్నారు. ఇండియా కూటమిలో మొదట కొనసాగి.. తర్వాత ఒంటరిగా పోటీకి దిగిన మమతాబెనర్జీ..ఎన్నికల్లో కూటమి గెలిస్తే బయటినుంచి మద్దతిస్తామంటున్నారు.

**అసలు ప్రధాని అభ్యర్థి అన్నదే ప్రశ్న:** 400 స్థానాల గురించి బీజేపీ మాట్లాడుతోందని.. అసలు బీజేపీ సొంతంగా 200 స్థానాలు గెలిచే పరిస్థితి కూడా లేదని ఎన్నికల ప్రచారాల్లో రాహుల్ పదే పదే చెబుతున్నారు. ఈ సంగతి పక్కనపెడితే.. ఒకవేళ ఇండియా కూటమి ఎక్కువ సీట్లు గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేసే పరిస్థితే వస్తే.. అసలు ప్రధాని అభ్యర్థి అన్నది ఎవరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రధాని అభ్యర్థిని ప్రకటించకుండానే బీజేపీ నేతృత్వంలోని %చీణూ% కూటమితో ఇండియా కూటమి ఢీకొట్టడంపై కాషాయదళంతో పాటు మిత్రపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే 2014, 2019లో ఘోర ఓటమి పాలయిన కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడిందా..మరింత దిగజారిందా అన్నది ఫలితాల తర్వాత తేలనుంది.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# ఏపీలో క్యాంప్ రాజకీయాలకు తెర లేస్తోందా ?

ఎవరు గెలిచినా బొటా బొటీ అంటున్నారు. మరో సందర్భంలో చూస్తే హంగ్ కూడా రావచ్చు అంటున్నారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలలో అలజడి రేగుతోంది. పేరుకు బయటకు గంభీరమైన ప్రకటనలు చేస్తున్నారు కానీ మెజారిటీ సీట్ల మీద నంబర్ మీద డౌట్లు అలాగే ఉన్నాయని అంటున్నారు. ఎందుకంటే ఈసారి ప్రతీ సీటులోనూ హోరా హోరీ పోరు సాగింది. ఎవరు గెలిచినా తక్కువ ఓట్లతోనే అని అంటున్నారు. అంతే కాదు చివరి ఓటు కూడా ఫలితాన్ని తిరగరాస్తుందని అంటున్నారు. దాంతో కౌంటింగ్ మీద అంతా దృష్టిని కేంద్రీకరించారు. మరో వైపు చూస్తే కౌంటింగ్ రోజున పెద్ద ఎత్తున ఘర్షణలు చెలరేగుతాయని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హోం శాఖను అలెర్ట్ చేయడంతో ఏపీలో కేంద్ర భద్రతా దళాలను ఏకంగా జూన్ 19 దాకా పొడిగించిన నేపథ్యం కనిపిస్తోంది.ఎ దీనిని బట్టి చూస్తే పోలింగ్ అనంతరం ఘటనలు ఒక ఎత్తు అయితే కౌంటింగ్ తరువాతనే అసలు సినిమా ఉందని అంటున్నారు. ఈసారి ఓటమిని అంగీకరించడానికి ఏ రాజకీయ పక్షమూ అంగీకరించే పరిస్థితి లేకపోవడం కూడా ఇందుకు కారణం అని అంటున్నారు. ఓడిన వారు కసిగా ఉంటారు. దాంతో ఏమైనా జరగవచ్చు అన్నదే కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు తెలియజేసిన విషయం అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే బొటా బొటీ మెజారిటీలు వచ్చినా కూడా ఆ పార్టీని గద్దెనెక్కిస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. సామ దాన భేద దండోపాయాలతో తమ వైపునకు తిప్పుకునే కార్యక్రమానికి కూడా తెర లేపుతారా అన్న చర్చ నడుస్తోంది. ఏపీలో ఇలాంటివి కొత్త కాదు, 1984, 1995లో వెన్నుపోటు రాజకీయాల వల్ల రెండు ప్రభుత్వాలు కుప్ప కూలిపోయాయి. ఇక దేశంలో ఇటీవల కాలంలో ఆ తరహా కల్చర్ కూడా ఎక్కువగా ఉంది. దాంతో కర్నాటకలో ఒక వైపు ఫలితాలు వస్తూండగా మరో వైపు తమ ఎమ్మెల్యేలను క్యాంపులకు తరలించడంలో కాంగ్రెస్ జేడీఎస్ పోటీ పడ్డాయి. తీరా ఫలితాలు వచ్చిన తరువాత భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలవడంతో సరిపోయింది. ఇక తెలంగాణాలో కూడా చూస్తే క్యాంప్ రాజకీయాలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ పూర్తి సన్నాహాల్లో ఉంది. అయితే హంగ్ బెడద లేకుండా మంచి మెజారిటీతోనే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కథ సుఖాంతం అయింది. మరి ఏపీలో ఏమి జరుగుతుంది అన్నదే చర్చగా ఉంది. బొటా బొటీ మెజారిటీలు వచ్చినా లేక హంగ్ వచ్చినా కూడా అనూహ్య పరిణామాలు సంభవించినా ఆశ్చర్యపోనవసరం లేదు అని అంటున్నారు. అధికారం నిలబెట్టుకోవడానికి ఒక పార్టీ అధికారం దక్కించుకోవడానికి మరో పార్టీ లైఫ్ అండ్ డెత్ గా పోరాడుతున్న అతి భీకర పోరు ఏపీలో ఉంది. దాంతో ఎవరూ తగ్గేదే లే అన్నట్లుగా ఉన్నారు. మరి క్యాంప్ రాజకీయాల్లో ఒక పార్టీ ఆరితేరిపోయి ఉంది అని అంటున్నారు. రెండవ పార్టీ కూడా పరిస్థితిని బట్టి అప్పటికపుడు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. ఏది ఏమైనా కూడా ఏపీలో కౌంటింగ్ వేళ ఏదో ఒక పార్టీ వైపుగా భారీ వేవ్ వీస్తే ఏమో కానీ బొటా బొటీ వస్తే మాత్రం ఎవరూ ఊహించని పరిణామాలు జరుగుతాయని అంతా అంచనా కడుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలలకు ఏటా వచ్చే అరకొర నిధులతో కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. దీంతో విద్యాప్రమాణాలు తగ్గిపోతున్నాయనే ఉద్దేశంతో.. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రారంభించిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద రెండో విడత ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలలు ఎంపిక చేశారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి దశలో పలు పాఠశాలలు ఎంపిక చేయగా వాటికి నిధులు కేటాయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రెండో విడత కింద 33 పాఠశాలలను ఎంపిక చేశారు. యూడైస్ ప్లస్ ప్రోగ్రాంలో నమోదైన సమాచారం ప్రకారం జిల్లాల వారీగా పీఎంశ్రీ పథకానికి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు 60 రకాల ప్రశ్నావళిని పూరించారు. పాఠశాల ఫొటోలు, పంచాయతీ, పాఠశాల తీర్మాన ప్రతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సొంత భవనం, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, విద్యార్థుల నమోదు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు, చేతుల శుభ్రత, సరిపడే సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యుత్తు, గ్రంథాలయ వసతి, వంటి అంశాలను అందులో నింపారు. దాని ఆధారంగా మొదటి విడతలో జిల్లాలో 30 పాఠశాలలను ఎంపిక చేశారు. తాజాగా రెండో విడతలో 11 పాఠశాలలను ఎంపిక చేశారు.

నిధుల మంజూరు ఇలా..

ఎంపికైన పాఠశాలలకు నాలుగేళ్లలో రూ.లక్షల్లో నిధులు విడుదలకానున్నాయి. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులు అందిస్తుంది. ఈ నిధులతో పోషకాహారం, తాగునీటి వసతి, సౌర విద్యుత్తు, ప్రయోగశాలలు, అంతర్జాల సదుపాయం, డిజిటల్ బోధన, వృత్తి విద్యా కోర్సులు, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, డిజిటల్ గ్రంథాలయం, క్రీడా మైదానం, నైపుణ్యాభివృద్ధి పెంపునకు చర్యలు తీసుకోనున్నారు. పాఠశాల దశ నుంచే వృత్తివిద్యా కోర్సులను ప్రోత్సహిస్తారు. విద్యార్థి డిగ్రీకి వచ్చే సరికి ఏదో ఒక రంగంలో ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని జాతీయ విద్యావిధానం లక్ష్యం.

నల్గొండ జిల్లాలో ఎంపికైనవి..టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ నకిరేకల్, జడ్పీ ఉన్నత పాఠశాల దేవరకొండ, జడ్పీ ఉన్నత పాఠశాల మిర్యాలగూడ, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ గంధంవారిగూడెం, టీడబ్ల్యూఆర్ఈఐఎస్ అవంతిపురం, జడ్పీ ఉన్నత పాఠశాల కట్టంగూర్, టీఎస్ఎమ్ఎస్ బొత్తలపాలెం, జడ్పీ ఉన్నత పాఠశాల వెంకటేశ్వరనగర్, జడ్పీ ఉన్నత పాఠశాల తిప్పర్తి, జడ్పీ ఉన్నత పాఠశాల చిట్యాల, జడ్పీ ఉన్నత పాఠశాల బ్రాహ్మణవెల్లంల, ఎమ్‌పీపీఎస్ నోముల, గౌట్ పీఎస్ నాగార్జునసాగర్, ఎమ్‌పీపీఎస్ బాడయిగడ్డ, ఎమ్‌పీపీఎస్ కాసనగౌడ్ పాఠశాలలు రెండో విడత పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేశారు.

ఎంపికైన పాఠశాలల్లో అవసరమైన వాటిని గుర్తించి నివేదిక ఇస్తామని డీఈవో భిక్షపతి తెలిపారు.

# జలమండలి వావ్!

హైదరాబాద్: నీటి ట్యాంకర్ బుక్ చేస్తే ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో.. రాదో తెలియని పరిస్థితి. ఇక నుంచి ఇలాంటి ఇబ్బందులకు జలమండలి చెక్ పెట్టనుంది. వాటర్ ఆన్ వీల్స్ (వావ్) పేరుతో కొత్త యాప్‌నకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం మాదాపూర్, సనత్‌నగర్, బంజారాహిల్స్ తదితర సెక్షన్ల పరిధిలో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. మరో 15 రోజుల్లో పూర్తిగా అందుబాటులోకి రానుంది.

బుకింగ్.. డెలివరీ ఇక సులువు

నీటి ట్యాంకర్ కావాలంటే ప్రస్తుతం వినియోగదారులు అష్టకష్టాలు పడుతున్నారు. జలమండలికి చెందిన వినియోగదారుల సేవా కేంద్రం నంబరు 155313కు ఫోన్ చేసి బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అనంతరం బుక్ అయినట్లు వినియోగదారుల సెల్ నంబరుకు సమాచారం పంపుతున్నారు. ఇప్పటివరకు వినియోగదారులు ట్యాంకర్‌ను ట్రాకింగ్ చేసే విధానం లేదు. ఫలితంగా అది ఎప్పుడొస్తుందో? ఎక్కడిదాక వచ్చిందో తెలియడం లేదు. కొన్నిసార్లు డ్రైవర్ ఫోన్ చేసినప్పుడు వినియోగదారులు ఫోన్ తీయకపోతే, ఏకపక్షంగా రద్దు చేస్తున్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి వాటర్ ఆన్ వీల్స్ యాప్ ప్రవేశపెడుతున్నట్లు జలమండలి రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్



తెలిపారు. ఫుడ్ డెలివరీ యాప్ మాదిరిగానే ఇది పని చేస్తుందని, స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడు చేసుకొని వినియోగించుకోవచ్చన్నారు. డబ్బులు సైతం యాప్ నుంచే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసినప్పుడే.. వరస సంఖ్య, డెలివరీ సమయం తదితర వివరాలు వినియోగదారులకు అందుతాయి. డెలివరీ సమయంలోనూ ఫోను చేస్తారు. ఇందుకోసం గ్రేటర్‌వ్యాప్తంగా ఫోన్ నంబరును అందుబాటులోకి తేనున్నారు. ఏకపక్షంగా ట్యాంకర్‌ను రద్దు చేసే సమస్య ఉండదు. ఈ యాప్ ద్వారా ఉచిత ట్యాంకర్లను సైతం బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది.

# గృహజ్యోతి వెలగాలంటే.. ఆదా చేయాల్సిందే



భువనగిరి : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్తు గృహజ్యోతి పథకంతో సామాన్యులకు ప్రయోజనం చేకూరుతోంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, నెలలో 200 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగించే వినియోగదారులకు జీరో బిల్లులు వస్తున్నాయి. అంతకు మించి ఒక యూనిట్ విద్యుత్తు వినియోగించినా మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వేసవిలో అన్ని వర్గాల విద్యుత్తు వినియోగదారుల విద్యుత్తు వినియోగం కొంత మేరకు పెరిగే అవకాశం ఉంది. వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు అందరూ నేడు ఫ్యాన్లు, కూలర్లు వినియోగిస్తున్నారు. ఉచిత విద్యుత్తు పొందే లబ్ధిదారులు సైతం ఈ వేసవిలో విద్యుత్తు వినియోగం పెరిగి బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ముందుచూపుతో పరిమితంగా విద్యుత్తు వినియోగించిన పక్షంలో గృహజ్యోతి పథకం లబ్ధి పొందే అవకాశం ఉంది.

పరిమితమైతేనే ప్రయోజనం...

పరిమితంగా విద్యుత్తును వినియోగించడం ద్వారా అర్హులు పథకం లబ్ధిపొందే అవకాశం ఉంది. ఎల్ఈడీ దీపాలు, ఐఎస్ఐ మార్క్, స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలు వినియోగించడంతో పాటు అవసరం మేరకు విద్యుత్తు వినియోగించిన పక్షంలో విద్యుత్తును ఆదా చేయవచ్చు. విద్యుత్తు వినియోగంలో వ్యక్తిగతంగా విచక్షణ పాటించడం ద్వార విద్యుత్తును ఆదా చేయడంతో పాటు, ఆర్థికంగా ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు...

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు అవసరం లేనప్పుడు ఆఫ్ చేయడం ద్వార విద్యుత్తు ఆదా చేయవచ్చు. ఛార్జింగ్ పూర్తయిన వెంటనే కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ల ఛార్జర్లను తొలగించాలి. వినియోగంలో లేనప్పుడు స్విచ్ఛాఫ్ చేయాలి.

ఎల్ఈడీ బల్బ్‌లు

ఎల్ఈడీ బల్బ్‌లను వినియోగించడం ద్వార విద్యుత్తును ఆదా చేయవచ్చు. నేటికీ కొందరు సంప్రదాయ విద్యుత్తు బల్బ్‌లు వినియోగిస్తున్నారు. విద్యుత్తు ఖర్చు అధికంగా ఉంటుంది. వీటి స్థానంలో స్టార్ రేటింగ్ కలిగిన బల్బ్‌లను వినియోగించిన పక్షంలో విద్యుత్తు ఆదా అవుతుంది.

ఫ్యాన్... కూలర్...

తక్కువ విద్యుత్తు వినియోగించుకునే ఫ్యాన్లు, కూలర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ కంపెనీలు తయారు చేస్తున్న ఫ్యాన్లు, కూలర్లకు స్టార్ రేటింగ్‌తో మార్కెట్‌లో లభిస్తున్నాయి. వీటి వినియోగంతో తక్కువ విద్యుత్తు వినియోగంతో సౌకర్యం పొందవచ్చు.

రిఫ్రిజిరేటర్లు...

ప్రస్తుతం మార్కెట్‌లో కన్వర్టబుల్ రిఫ్రిజరేటర్లు లభిస్తున్నాయి. సీజన్‌ల వారీగా లోపలి ఉష్ణోగ్రతను పెంచే, తగ్గించుకునే అవకాశం ఉంది. లోపలి భాగంలో ఐస్ పేరుకుపోకుండా జాగ్రత్త పడాలి. ఐస్ ఏర్పడిన పక్షంలో డీఫ్రాస్ట్ చేయాలి. స్టార్ రేటింగ్ ఉన్న రిఫ్రిజిరేటర్లను వినియోగించడం ద్వార విద్యుత్తును ఆదా చేయవచ్చు.

# పాఠ్య పుస్తకాలొస్తున్నాయ్

సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో డిసెంబరు నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా వీటిని సరఫరా చేసింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3,73,746 పుస్తకాలు అవసరం ఉండగా, ప్రస్తుతం 1.2 లక్షల పుస్తకాలు బుధవారం వచ్చాయి. గత సంవత్సరం పంపిణీ చేయగా మిగిలినవి 5,846 ఉన్నాయి. మిగతా పుస్తకాలు జూన్ రెండో వారం నాటికి జిల్లాకు చేరుకుంటాయని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చిన పుస్తకాలను జిల్లా కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలోని గోదాంలో భద్రపరిచారు. జూన్ మొదటి వారంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా మండలాలకు పంపిణీ చేయనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు మండల విద్యాధికారులు అందజేయనున్నారు. జిల్లాలో 510 ప్రభుత్వ, 7 రెసిడెన్షియల్, 3 ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించే విధంగా విద్యాశాఖ అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో...

గత విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి 9వ తరగతి వరకు ఒకే పుస్తకంలో ఓవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లం పాఠం ఉండేది. ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పుస్తకాలను కూడా ఇదే



విధంగా ముద్రించారు. మూడు నుంచి పదో తరగతి వరకు పార్ట్‌వన్, పార్ట్ టుగా పుస్తకాలు ఉన్నాయి. సిలబస్ ఆధారంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించేందుకు ప్రస్తుతం పార్ట్ వన్ పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ సిలబస్ నవంబర్ చివరి నాటికి ముగియనుంది. పార్ట్ టు పుస్తకాల్లోని సిలబస్ డిసెంబరు నుంచి ప్రారంభమవుతుందని, నవంబరు కంటే ముందు పార్ట్ టు పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. పాఠ్య పుస్తకాలలో ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలకు ప్రతి పాఠానికి బార్‌కోడ్ ఉంది. దీనిని చరవాణిలోని స్కానర్‌తో స్కాన్ చేస్తే ఆ పాఠాన్ని వీడియో ద్వారా చూడవచ్చు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్కులు కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

ప్రతి పుస్తకానికి నంబరు...

ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే ప్రతి పుస్తకంపైన నంబరు ముద్రించింది. ప్రతి పుస్తకం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే అందే విధంగా ఈ నంబరు ఉపయోగపడనున్నది. వీటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాకుండా ఇతరులకు పంపిణీ చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసే సమయంలో పాఠశాలలోని స్టాక్ బుక్కులో విద్యార్థుల పేరుతో పాటు పాఠ్యపుస్తకాలపై ఉన్న నంబర్లను నమోదు చేసి విద్యార్థులకు అందించనున్నారు.

స్టాకు రిజిస్టర్‌లో నమోదు చేయాలి

బూస రాజేందర్, జిల్లా పాఠ్యపుస్తకాల ఇన్‌ఛార్జి మేనేజర్జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు అందజేస్తాం. జూన్ మొదటి వారంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా మండలాల మండల వనరుల కేంద్రాలకు అందజేస్తాం. అక్కడి నుంచి మండల విద్యాధికా రులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసే సమయంలో స్టాక్ రిజిస్టర్‌లో పుస్తకాల పైన ఉన్న నంబరును నమోదు చేయాలి.

# బోర్డులే తప్ప.. కనిపించని ఆటలు

రాయికల్ : గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు, యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గత ప్రభుత్వం పల్లెలు, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. నిర్దేశించిన విధంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఆటలు ఆడేందుకు అనువుగా లేకపోవడంతో యువత ఆసక్తి చూపడం లేదు. పంటలు వేయని బీడు భూములు, ఖాళీ ప్లాట్లను మైదానాలుగా మార్చుకొని వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలు నిర్వహించుకుంటున్నారు.

పట్టణంలో ఇలా..

రాయికల్ పురపాలక సంఘం పరిధిలో 12 వార్డులు ఉండగా 7 వార్డులలో ఇప్పటికే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. 1, 4, 5, 7, 8, 10, 11 వార్డుల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు ఒక్కోదానికి రూ.50 వేల చొప్పున ఖర్చు చేశారు. మిగతా వార్డుల్లో స్థలం అందుబాటులో లేకపోవడంతో ఏర్పాటు చేయలేదు. పట్టణంలో క్రీడలకు అనువుగా ఉండే స్థలాలు లేకపోవడంలో ఊరికి దూరంగా పిచ్చి మొక్కల మధ్యన, ప్రభుత్వ పాఠశాల మైదానాలు, ప్రయాణ ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని, దేవాలయం చుట్టూ ఉన్న స్థలాలను ఎంపిక చేసి బోర్డులు, వ్యాయామ బార్‌లను ఏర్పాటు చేసి వదిలేశారు.

చెత్తకుప్పలో..

4వ వార్డులో స్థలం అందుబాటులో లేకపోవడంతో గతంలో స్థానిక బస్టాండ్‌లో క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటు చేశారు. పలువురి విమర్శలు, ఆర్టీసీ అధికారుల నుంచి అభ్యంతరాలు రావడంతో ఇటీవల బోర్డు తొలగించి పక్కన పడేశారు. 5వ వార్డులో స్థలం అందుబాటులో లేకపోవడంతో బీమన్న దేవాలయం స్థలంలో ఏర్పాటు చేశారు. దేవాలయంలో ఇటీవల జాతర నిర్వహించగా ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు తొలగించడంతో నిరుపయోగంగా మారాయి.

పరిమిత స్థలంలో..



7వ వార్డులో పెద్ద చెరువుకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం వార్డు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ పరిమిత స్థలంలో ఏర్పాటు చేశారు. చిన్న స్థలం కావడంతో క్రీడలకు అనుగుణంగా లేదు. వ్యాయామ బార్‌లు వంగిపోయి ఉన్నాయి. క్రీడా ప్రాంగణాలు పేరుతో బోర్డులు ఏర్పాటు చేయడం మినహా ఎలాంటి పనులు చేపట్టలేదు.

ధాన్యం కొనుగోలు కేంద్రంగా..

8వ వార్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం విశాలంగా ఉన్నప్పటికీ పట్టణానికి దూరంగా ఉండటంతో నిరుపయోగంగా ఉంది. స్థానికంగా ఉండే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వినియోగిస్తున్నారు. క్రీడా ప్రాంగణం పక్కనే అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియం ఉంది.

# భౌబోయ్

హైదరాబాద్ : అధిక ఉష్ణోగ్రతలతో జనమే కాదు...జంతువులూ అల్లాడిపోతున్నాయి. ముఖ్యంగా కుక్కలపై ఎండ తీవ్ర ప్రభావం చూపుతోంది. తాగడానికి నీళ్లు, ఆహారం దొరక్క ఇబ్బందులు పడుతున్నాయి. ఎవరైనా వాటి దగ్గరకు వెళ్లినా కవ్వించేటట్లు చేసినా దాడి చేస్తున్నాయి. ఎండలు తీవ్రం అవుతున్న కొద్దీ నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం)కు కుక్కకాట్ల బాధితుల తాకిడి పెరుగుతోంది. ఒక్క ఏప్రిల్‌లోనే నిత్యం 100 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో 40–44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆహారం, నీళ్లు దొరక్క పోవడం తోపాటు హార్మోన్ల మార్పులతో కొన్ని కుక్కలు దూకుడుగా వ్యవహరిస్తుంటాయి. అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీల్లో ఉండే వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కుక్కకాట్ల నుంచి తప్పించుకోవచ్చని జంతు ప్రేమికులు చెబుతున్నారు. అవి ఏంటో ఒకసారి చూద్దామా...!

99 శాతం కుక్కలు స్నేహపూర్వకంగా ఉంటాయి. వాటి పట్ల కాస్త జాలి చూపించినా సరే విశ్వాసంతో ఉంటాయి. మనుషులంటే భయంతోనే మెలగుతుంటాయి. అయితే వాటి శరీరంలో వచ్చిన మార్పులతో కొన్నిసార్లు దూకుడుగా ప్రవర్తిస్తుంటాయి. ఇలాంటి కుక్కల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి.

కుక్క చెవుల్లో ఒకటి కొంత మేర కత్తిరించి ఉంటే వాటికి సంతాన నిరోధక శస్త్రచికిత్స చేసి యాంటిరేబిస్ వ్యాక్సిన్ ఇచ్చినట్లు లెక్క.



కుక్క కనిపిస్తే వాటి కళ్లలోకి సూటిగా చూడకూడదు. పట్టనట్లు వెళ్లే ఏమనవు. మీ ప్రాంతంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉంటేవెంటనే కార్పొరేషన్, మున్సిపాలిటీల వాళ్లకు సమాచారం అందించాలి. వారు వాటిని పట్టుకొని సంతాన నిరోధక శస్త్రచికిత్స చేసి యాంటిరేబిస్ వ్యాక్సిన్ ఇస్తారు. ఒకసారి శస్త్రచికిత్స అయ్యాక వాటిలో టెస్టోస్టిరాన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోయి దాడి చేయవు.

వేసవిలో నీళ్లు, ఆహారం కొరత ఉంటుంది. కాలనీలు, అపార్ట్‌మెంట్ల బయట చిన్నచిన్న బౌల్స్ ఏర్పాటు చేసి వాటిలో నీళ్లు, ఆహారం పెడితే కుక్కల్లో దూకుడు స్వభావం తగ్గి ఆ ప్రాంతంలో తిరిగే వారితో విశ్వాసంతో ఉంటాయి. అంతేకాక అపార్ట్‌మెంట్లలో ఉండేవారు 5–6 వీధి కుక్కలను దత్తత తీసుకొని వాటికి వ్యాక్సిన్, ఆహారం, నీళ్లు లాంటివి అందించాలి. వాటికి నివాసం కల్పిస్తే దాడి చేయవు.

అన్నిటికంటే ముఖ్యంగా కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే గాయాన్ని సబ్బుతో కడగాలి. గాయంపై నీళ్లు ధారలా పడేలా జాగ్రత్త తీసుకోవాలి. దీనివల్ల రేబిస్ కలిగించే వైరస్ బయటకు పోతుంది. వెంటనే వైద్యులను సంప్రదించి యాంటీరేబిస్ టీకా తీసుకోవాలి. పెంపుడు కుక్కలకు ముందే యాంటీరేబిస్ ఇప్పించాలి. పెంపుడు కుక్కలు కరిచినా నిర్లక్ష్యం చేయకూడదు. పూర్తిస్థాయిలో ఔషధాలను తీసుకోవడం వల్ల భవిష్యత్తులో రేబిస్ సోకకుండా చూసుకోవచ్చు.

# మీటరు గిర్రుమంది.. గుండె గుబిల్లు మంది



హైదరాబాద్ : ఎండల తీవ్రత ఈసారి మే నెలతో పోలిస్తే ఇప్పటివరకు ఏప్రిల్‌లో అధికంగా ఉంది. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వినియోగదారుల కరెంట్ వాడకం కూడా అదే రీతిలో పెరిగింది. ఫిబ్రవరి, మార్చి వినియోగంతో పోలిస్తే ఏప్రిల్‌లో అసాధారణంగా వాడకం కనిపిస్తోంది. దీంతో అదే స్థాయిలో వినియోగదారుల విద్యుత్తు బిల్లులు పెరిగాయి. చేతికందిన బిల్లులు చూసి వినియోగదారుల గుండేలు గు'బిల్లు'మంటున్నాయి. వాడనైతే వాడాము కానీ ఇప్పుడు కడుతుంటే ఆ భారం తెలుస్తుందని అంటున్నారు.

నగరంలోని తొమ్మిది విద్యుత్తు సర్కిళ్ల పరిధిలో ఎల్‌టీ వినియోగదారులు 60 లక్షల వరకు ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గరిష్ఠంగా 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేడి నుంచి ఉపశమనం కోసం ఇళ్లలో, కార్యాలయాలు, దుకాణాల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల మోత మోగించారు. భూగర్భ జలాలు అడుగంటడంతో మోటార్లు సైతం ఎక్కువ గంటలు పనిచేశాయి. ఎండకాలం కావడంతో నీటి వాడకమూ పెరిగింది. ఫలితంగా గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 4300 మెగావాట్లకు చేరింది. ఒకరోజు గరిష్ఠ వినియోగం 90 మిలియన్ యూనిట్లు నమోదైంది. సహజంగానే వాడకం పెరగడంతో వినియోగదారుల బిల్లులు పెరగడానికి కారణమైంది.

**ఈ రెండు నెలల్లోనే..**

ఫిబ్రవరిలో ఎల్‌టీ వినియోగదారుల మొత్తం బిల్లులు రూ.687 కోట్ల వరకు ఉంటే.. మార్చిలో ఎండల కారణంగా అది కాస్త రూ.903 కోట్లకు పెరిగింది. ఏప్రిల్‌లో రూ.1017 కోట్ల వరకు చేరింది. సర్కిళ్ల వారీగా చూస్తే ఒక్క రాజేంద్రనగర్‌లో తప్ప మిగతా అన్నిచోట్ల బిల్లులు భారీగా పెరిగాయి.

**ఆదాకు చిట్కాలు..**

పగటిపూట సహజ వెలుతురు ఉండేలా చూసుకోవాలి. రాత్రిళ్లు అవసరమైన మేర లైట్లు వేసుకోవాలి.

ఏసీని సైతం 24 డిగ్రీల వద్ద ఉండేలా చూసుకోవాలి. వేసవిలో అధిక బిల్లులకు ఏసీ వాడకమే కారణం. దీన్ని పొదుపుగా ఏ సమయంలో అవసరమో అప్పుడే వాడుకోవాలి.

విద్యుత్తు ఆదాతో వినియోగాన్ని 200 యూనిట్ల లోపు పరిమితం చేసుకోగల్గితే కరెంట్ బిల్లు భారం కాదు. అర్హులకు ప్రభుత్వం ఇచ్చే సున్నా బిల్లు వెసులుబాటు కొనసాగుతుంది.

నాణ్యమైన, బ్రాండెడ్ ఉపకరణాలు వాడితే కరెంటు తక్కువగా కాలుతుంది. నాసిరకం వాటితో ఎప్పటికైనా ప్రమాదమే.

# ధాన్యం దగ్గరపడింది..!



నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరాయి. ఎన్నికల సమయంలోనూ రైతులకు ఇబ్బందులు కాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇప్పటికే ముగియగా..యాదాద్రి జిల్లాలో కొంత మేర ధాన్యం నిల్వలు కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయి. యాదాద్రి జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటూ నల్గొండలో వర్షాలు కురవడంతో ధాన్యం రాసులు తడిసిపోయాయి. తడిసిన, తేమ ఉన్న ధాన్యాన్ని సైతం అధికారులు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు మూడు జిల్లాల్లో కలిపి 7.39 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. రైతులకు రూ.1297 కోట్లు చెల్లించారు. సుమారు 70 శాతం రైతుల ఖాతాల్లో నిధులు ఇప్పటికే జమ అయ్యాయి. నాలుగైదు రోజుల్లో మొత్తం రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి నీటి విడుదల లేకపోవడంతో ఈ యాసంగిలో ఆయకట్టులో పంట విరామం (క్రాప్ హాలిడే) ప్రకటించారు. దీంతో సుమారు 4 లక్షల ఎకరాల వరకు విస్తీర్ణంలో వరిని సాగు చేయలేదు. అయినా కొనుగోలు కేంద్రాలకు ఈ సీజన్‌లో సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ సీజన్ ముగిసే నాటికి సైతం 7.39 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేయడం గమనార్హం. మరో 20 నుంచి 25 వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉంది. అంటే సుమారు 7.8 లక్షల మెట్రిక్ టన్నుల వరకే కొనుగోలు కేంద్రాలకు వచ్చినట్లు సమాచారం.

మిల్లులు, రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగుల్లో ఖాళీ స్థలం లేదని, అక్కడున్న బియ్యం, ధాన్యాన్ని తరలించిన వెంటనే కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు.

మరోవైపు యాసంగి సీజన్‌లో నల్గొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, నకిరేకల్, భువనగిరి ప్రాంతాల్లోని రైతులు సన్నధాన్యాన్ని ఎక్కువగా సాగు చేయడం, గతంలో ఎన్నడూ లేని విధంగా మిల్లర్లు సైతం రూ.2500 నుంచి రూ.2800 వరకు కొనుగోలు చేయడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లకుండానే నేరుగా మిల్లర్లకు విక్రయించారని అధికార యంత్రాంగం వెల్లడిస్తోంది. ఈ కారణంగా కేంద్రాలకు అనుకున్న దాని కన్న తక్కువ ధాన్యం వచ్చిందని వారు అభిప్రాయపడుతున్నారు. యాదాద్రిలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వస్తుందని అంచనా వేసినా ఇప్పటికే అధికారులు 2.20 లక్షల టన్నుల మేర కొన్నారు.

**మిల్లుల్లో జాగా లేక.. జాగు**

గత సీజన్లలో రాష్ట్ర వ్యాప్తంగా మిల్లుల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు బహిరంగ మార్కెట్‌లో టెండర్ ధర ప్రకారం అమ్మేసింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సదరు ఏజెన్సీ నిర్వాహకులు మిల్లుల నుంచి ఖాళీ చేయడం లేదు. ధాన్యం తరలింపులో ప్రభుత్వం సైతం సదరు ఏజెన్సీపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటూ గత పక్షం రోజుల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణలోనూ భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) జాప్యం చేస్తుందని తెలిసింది. దీంతో మిల్లుల్లో జాగా లేక కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అలాగే ఉంటుంది. ఈ సమస్య యాదాద్రి జిల్లాలో ఎక్కువగా ఉంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు చేరవేయడానికి లారీలు సైతం దొరకడం లేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వలిగొండ మండలం ప్రొద్దుటూరు, ఎదులగూడెం, సంగెం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ 50 శాతానికి పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా వర్షాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# అనుమతులా.. అవెలా ఉంటాయ్?

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో రెవెన్యూ, పురపాలక శాఖల అధికారులు నిమగ్నమై ఉండగా..కొందరు రియల్ వెంచర్ల ప్రతినిధులు అనధికారికంగా లేఅవుట్లు వేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో విమానాశ్రయానికి సమీపంలో, సాతంరాయి, మామిడిపల్లి గ్రామాల పరిధిలో ప్రవేటు పట్టా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పట్టా భూముల్లో లేఅవుట్లు వేయాలన్నా, రన్‌వే సమీపంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నా శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు, విమానాశ్రయ అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరి. వీటిని బేఖాతరు చేస్తూ రియల్ వ్యాపారులు లేఅవుట్లలో సిమెంట్ రోడ్లు, ప్రహరీలు నిర్మిస్తున్నారు. కొన్నిచోట్ల స్వాగత ద్వారాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. శంషాబాద్ మున్సిపల్ అధికారులు వీటి కన్నెత్తి చూడడం లేదు.తక్కువ ధరలంటూ ప్రచారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి, సాతంరాయి, మామిడిపల్లి, వేలంకనినగర్ ఎదురుగా కొందరు రియల్ వ్యాపారులు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. తక్కువ ధర, విమానాశ్రయానికి దగ్గర, ఔటర్‌పైకి



అయిదు నిముషాల్లో చేరుకోవచ్చని వాటిని విక్రయిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రారంభమైన కొద్దిరోజులకే మామిడిపల్లి, సాతంరాయి గ్రామాల్లో 10కి పైగా లేఅవుట్లు వేశారు.

**తప్పయ్యింది.. జరిమానా వేయండి..**

మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే కొందరు లేఅవుట్లు వేసి..రోడ్లు, ప్రహరీ నిర్మిస్తున్నారు. అనుమతులున్నాయా ? అని అడిగితే అనుమతులా.. అవెలా ఉంటాయని..? పేర్కొనడం గమనార్హం. ఇష్టం వచ్చినట్లు లేఅవుట్లు వేసి వాటిలో నిర్మాణాలు చేపట్టినప్పుడు మున్సిపల్ అధికారులు వస్తే తప్పయింది, జరిమానా వేయండి అంటూ అభ్యర్థించడంతో అక్రమ లేఅవుట్లు సక్రమం అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు విధిస్తున్న జరిమానానే వారిపాలిట వరమవుతోంది. జరిమానా చెల్లింపు పత్రాల ఆధారంగా వాటికి ఇంటి నంబర్లు వేసుకుంటున్నారు. విద్యుత్తు కనెక్షన్లు తీసుకుంటున్నారు. తర్వాత తాగునీటి కనెక్షన్లకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇవన్నీ పూర్తయ్యాక క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకుంటున్నారు.క్రమబద్ధీకరణకు ఆమోదం లభించే వరకు ఆ నిర్మాణాల్లో ఎవరైనా ఉండొచ్చు.

# వానరబాధ తీరేదెలా..!

గుర్రంపోడు : రామాయణంలో వానరసైన్యం రాముడికి అండగా ఉండి రావణుడి సైన్యంతో పెద్ద యుద్ధమే చేసింది. ఈనాడు అదే వానరసైన్యం జన జీవనానికి ఇబ్బందిగా మారింది. అడవుల్లో చెట్లపై దొరికే పండ్లు, కాయలు తింటూ జీవించే వానరాలు (కోతులు) ప్రస్తుతం అడవుల్లో ఆహారం దొరకక జనావాసాల్లోకి వచ్చేశాయి. ఆహారం కోసం ఇళ్లల్లోకి వచ్చి ఏది దొరికితే అది తిని ఆకలి తీర్చుకోవటమేకాక అడ్డువచ్చిన పిల్లలను, పెద్దలను భయపెడుతున్నాయి. కొందరిని కరిచి గాయపరుస్తుం డటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. నిన్నమొన్నటి వరకూ అడవులకు సమీపంలో ఉండే గ్రామాల్లోనే కనిపించే కోతులు ప్రస్తుతం అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ తిరుగుతూ జనజీవనంలో అలజడి సృష్టిస్తున్నాయి. ప్రధానంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోని నాగార్జునసాగర్, దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో కోతుల సమస్య మరింత తీవ్రంగా మారింది. గతంలో జనం ఫిర్యాదులపై స్పందించిన సామాజిక అటవీ విభాగం అధికారులు కోతులను పట్టి అడవులకు తరలించి అక్కడ వదిలిపెట్టేవారు. అవి మళ్లీ, మళ్లీ తిరిగి వస్తుండటంతో వాటిని అడ్డుకోవడం ఎవరి తరం కావట్లేదు. అవి ఒక్కచోట ఉండేవి కాకపోవటంతో కోతుల సంఖ్యను లెక్కించే పరిస్థితులు ప్రస్తుతం లేవని అధికారి ఒకరు వెల్లడించారు.

**పండ్లు, కూరగాయల తోటలపై దాడులు..**


గ్రామాల్లో గుంపులుగా తిరిగే కోతులకు తగిన ఆహారం దొరకకపోవటంతో కూరగాయలు, పండ్ల తోటలపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో కొందరు రైతులు కూరగాయల తోటలు వేసేందుకే జంకుతున్నారు. కూరగాయలు గణనీయంగా పండించే గ్రామాల్లో నేడు పూర్తిగా వాటిని పండించడం తగ్గిపోయింది. ఇక మామిడి, జామతోటలు సాగుచేస్తున్న రైతులు కోతుల బారి నుంచి తప్పించుకోలేక పండ్లచెట్లను సమూలంగా తీసివేస్తున్నారు. మఠంపల్లి మండలంలో సాగుచేసిన జామతోటను కోతులు ఆక్రమించుకుని రైతును కూడా తోటలోకి రానీయకుండా చేయటంతో విసిగిపోయిన ఆ రైతు జామతోటనే తొలగించేశారు. గుర్రంపోడు మండలంలోని పాశంవారిగూడెం, శాకాజిపురం, వెల్దండపాడు గ్రామాల పరిధిలో కోతుల గుంపు దాడుల కారణంగా ఆ గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును క్రమంగా మానేశారు.

నెరవేరని లక్ష్యం.. కోతుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి మండలంలో కోతుల ఆహారశాలలు ఏర్పాటు చేసింది. వాటిల్లో పండ్లచెట్లు పెట్టి కోతులను గ్రామాల్లోకి రానీయకుండా చేసే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేయగా.. వాటి లక్ష్యం మాత్రం నెరవేరటంలేదు. వీటిని ఏర్పాటు చేసిన తొలిరోజుల్లో కొన్ని మొక్కలు నాటినప్పటికీ నిర్వహణ లేకపోవటంతో అవి పూర్తిగా ఎండిపోయాయి. ప్రస్తుతం కోతుల ఆహారశాలలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణాల్లో కోతుల దాహం తీరే పరిస్థితి కూడా లేదు. నాగార్జునసాగర్‌లోని నీళ్లట్యాంకులో పడి కోతులు చనిపోయిన ఘటన కోతుల జీవన పరిస్థితికి అద్దం పడుతోంది.

# నీరింకిన వాగులు.. ఒట్టిపోయిన బోర్లు

తాండూరు : వర్షాలు లేక యాసంగి పంటలు అనుకున్నంతగా సాగలేదు. జిల్లాలోని వాగులు, వంకల్లో ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో వాగులన్నీ రాళ్లు, ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చిన వరద కారణంగా చిన్న పాటి వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించి చెరువులు, కుంటలను నింపేశాయి. కోట్‌పల్లి, లక్నాపూరు, సర్పన్‌పల్లి, జుంటుపల్లి, అల్లాపూరు, నందివాగు, కొంశెట్‌పల్లి, శివసాగర్, కాకరవేణి జలాశయాలతో పాటు 1,179 చెరువులు, కుంటలు జలకళతో కనిపించాయి. వరద నీరంతా కాగ్నా, కాకర వేణి నదుల్లోకి వెళ్లడంతో నదుల మధ్యలో నిర్మించిన ఆనకట్టలు నిండు కుండలా మారి పోయాయి. గత ఫిబ్రవరి నుంచి ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహం క్రమేపి తగ్గు ముఖం పట్టింది. దీంతో వాగులు, వంకలు, కాగ్నా, కాకరవేణి నదుల్లోనూ ప్రవాహం మందగించింది. మార్చి మొదటి వారం నుంచే వేసవి ఎండలు ఎక్కువ కావడంతో నీరు అడుగంటి ప్రవాహం ఆగిపోయింది. ప్రధానమైన కాగ్నా, కాకరవేణి నదుల్లోని ఆనకట్టల్లో మినహా నదుల పొడవునా నీరు లేక రాళ్లు రప్పలు, ఇసుక దిబ్బలు తేలి కనిపిస్తున్నాయి.

పరివాహక వ్యవసాయ బోర్లపై ప్రభావం: నదుల్లో ప్రవాహం లేక





పోవడంతో పరివాహక బోర్లలో నీటి మట్టాలు లోలోతుకు వెళ్లాయి. ఒక చోట 5 మీటర్ల లోతుకు వెళితే, మరో చోట 10 నుంచి 15 మీటర్ల లోతుకు చేరాయి. దీంతో చాలా బోర్లు ఒట్టి పోతే కొన్ని బోర్లు సన్నటి ధారగా నీటిని పోస్తున్నాయి. మరి కొన్ని బోర్లు ఆగి ఆగి నీటిని పైకి తోడుతున్నాయి. మిగిలిన బోర్ల నుంచి నీరు ఒత్తిడి తగ్గి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళనతో ఉన్నారు. ఈ పరిణామం రైతులను ఆర్థికంగా దెబ్బతీసేదిగా కనిపిస్తోంది. సాగు నీటి ఎద్దడిని ముందస్తుగా అంచనా వేసిన కొందరు రైతులు బోర్ల నుంచి వచ్చే నీటికి సరిపడా పంటలనే సాగు చేసి ఆందోళనకు దూరంగా ఉన్నారు. 45 రోజుల నుంచి 60 రోజుల వ్యవధిలో వచ్చే పంటలను పరిమిత విస్తీర్ణంలో సాగు చేసుకోవాలని నిపుణులు సూచించిన మేరకు పంటలను సాగు చేశారు.

**వర్షాలు ఎక్కువగా కురిస్తేనే..**

జిల్లాలో వర్షాలు ఎక్కువగా కురిస్తేనే నీటి వనరులకు పూర్వపు స్థితి వస్తుంది. ఎగువ నుంచి వచ్చే వరదతో వాగులు, వంకలు ప్రవహించి చెరువులు, జలాశయాలు నిండాలి. ఫలితంగా భూగర్భ జల మట్టం పెరిగి బోర్లలోనూ నీటి మట్టం పెరుగుతుంది. ఈ పరిణామం రైతులకు లాభిస్తుంది. ఎక్కువగా నీరుంది కదాని అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయడం కంటే లాభదాయకమైన పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే బాగుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఉస్మానియా.. జేఎన్‌టీయూ వీసీ పోస్టులకు డిమాండ్

హైదరాబాద్: రాష్ట్రంలోని పలు వర్సిటీలకు త్వరలో ఉపకులపతులను నియమించనున్న నేపథ్యంలో రాజధానిలో ఉన్న 5 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉస్మానియా, జేఎన్‌టీయూ వర్సిటీల వీసీ పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. నగరంలో ఉస్మానియా, జేఎన్‌టీయూ, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలున్నాయి. వీటి ఉపకులపతులుగా కొనసాగున్న వారి పదవీకాలం ఈనెల మూడోవారంలో పూర్తవుతుంది. వీసీ ఎంపికలో దరఖాస్తుదారుల పరిపాలన దక్షత, నిజాయతీ, నిబద్ధతలు ప్రామాణికాలుగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.విదేశీ వర్సిటీలకు దీటుగా ప్రభుత్వ వర్సిటీలు బోధన అందించాలని, పరిశ్రమల అవసరాలకనుగుణంగా మూల్యాంకనాల్లో మార్పులు చేర్పులు చేయాలని, వర్సిటీల్లో చదువు పూర్తైన వెంటనే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలంటూ ఆయన అధికారులకు కొద్దిరోజుల క్రితం వివరించారు. వీటన్నింటినీ పర్యవేక్షించడంతోపాటు విశ్వవిద్యాలయాల గతిని మార్చేందుకు ఆలోచనలు, ప్రణాళికలున్న వారినే ఉపకులపతులుగా ఎంపిక చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ఈ



నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్నారు. పరిపాలన అనుభవంతోపాటు వయసునూ పరిగణనలోకి తీసుకుంటున్నారు. తాజాగా దరఖాస్తు చేసుకున్న వారిలో వీసీలుగా పనిచేసిన వారూ ఉన్నారు. దరఖాస్తు గడువు ముగిసేలోపు ఉపకులపతుల పోస్టుల కోసం వందలమంది దరఖాస్తు చేసుకున్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీకి 200 మందికిపైగా దరఖాస్తులు సమర్పించారు. ఉస్మానియా, జేఎన్‌టీయూ వీసీ పోస్టులకు అధికంగా ఆసక్తి చూపిస్తున్నారు. తమ పరిపాలన అనుభవం, పరిశోధనలు, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు కలిసి వస్తాయని ఆశిస్తున్నారు. ముఖ్యంగా ఓయూ వీసీగా పనిచేసేందుకు ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. జేఎన్‌టీయూ నుంచి కూడా కొందరు ప్రొఫెసర్లు వీసీ పోస్టుకు ఆసక్తి చూపిస్తున్నారు. అన్వేషణ కమిటీ వడపోతలో వీరుంటారా? లేదా? అన్నది తెలిసే అవకాశాలున్నాయి.




## నా మనవడు తప్పు చేస్తే..: ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యం కేసుపై దేవెగౌడ స్పందన

బెంగళూరు: హాసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వీడియోల వ్యవహారంలో జేడీఎస్ అధినేత దేవెగౌడ మొదటిసారి స్పందించారు. ఈ కేసు నుంచి ఎవరూ తప్పించుకోకూడదన్నారు. ఇందులో చాలా మందికి ప్రమేయం ఉందని, వారిని వదిలిపెట్టకూడదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు జాతీయ మీడియాతో మాట్లాడారు. "ప్రజ్వల్ ప్రస్తుతం దేశంలో లేడు. చట్టప్రకారం చర్యలు ఉండాలని ఇప్పటికే హెచ్‌డీ కుమారస్వామి చెప్పాడు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తుల పేర్లు చెప్పను కానీ.. వారిపై కూడా చర్యలు ఉండాలి" అని దేవెగౌడ అన్నారు. ఇదిలా ఉంటే.. ప్రజ్వల్‌తో తనకు ఎలాంటి కాంటాక్ట్ లేదని కుమారస్వామి చెప్పారు. కర్ణాటకలో ఉన్న సమయంలో కూడా టచ్‌లో లేనన్నారు. అతడి వెంట పరిగెత్తాలా ఏంటి..? అని ప్రశ్నించారు. మరోపక్క, కిడ్నాప్ కేసుకు సంబంధించి కర్ణాటక మాజీ మంత్రి, ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణకు ఇటీవల బెయిల్ వచ్చింది. తనయుడి లైంగిక దౌర్జన్యం ఆరోపణలకు సంబంధించి బాధిత మహిళను అపహరించిన కేసులో మే 4న ఆయన్ను ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. అరెస్టు సమయంలో ఆయన అధికారులకు సహరించలేదు. తన తండ్రి, మాజీ ప్రధాని దేవేగౌడ నివాసంలో ఉన్న ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు రాగా.. సాయంత్రం 5.17 గంటల నుంచి 6.50 గంటల వరకు సరైన సమయం కాదని, ఇంట్లో తలుపు వేసుకుని కూర్చున్నారు. సాయంత్రం 6.50 తర్వాత ఆయనే తలుపు తీసి, సిట్ అధికారుల ముందు లొంగిపోవడం గమనార్హం. ఇక, ప్రజ్వల్‌ను స్వదేశానికి తీసుకువచ్చే ప్రయత్నాలు మాత్రం ఫలించలేదు.




మేడ్చల్: మాజీ మంత్రి మల్లారెడ్డి వర్సెస్ 15 మంది మధ్య భూ వివాదం తారా స్థాయికి చేరింది. కోర్టు వివాదంలో ఉన్న తమ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి కలిసి స్థలంలో వేసిన బారికేడ్లను తొలగించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీసులతో కూడా మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు వాగ్వాదానికి దిగారు. సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82 లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి వాదిస్తున్నారు. అందులో 1.11 ఎకరాల భూమి తమదంటూ మరో 15 మంది వాదనకు దిగారు. ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమి కొనుగోలు చేయాలని సదరు 15 మంది వ్యక్తులు చెబుతున్నారు. కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని వారు అంటున్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నందున ఘటనా స్థలంలో ఎలాంటి గొడవలు చేయొద్దని ఇరువర్గాలకూ పోలీసులు సర్ది చెబుతున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని సదరు 15 మంది వ్యక్తులు చెబుతున్నారు. పోలీసులు ఇంకా ఘటనా స్థలంలోనే ఉన్నారు.




బెంగళూర్: కర్ణాటక రాజకీయాలను ప్రజ్వల్ రేవణ్ణ వీడియోలు ఓ కుదుపు కుదిపేశాయి. ఆ వీడియోలు బయటకు వచ్చేందుకు వెనక కుట్ర జరిగిందని తెలుస్తోంది. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆ వీడియోలు బయటకు వచ్చేలా చేశారని బీజేపీ నేత జి దేవరాజే గౌడ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటకలో కుమారస్వామిని రాజకీయంగా ఫినిష్ చేయాలనేది డీకే టార్గెట్ అని బాంబ్ పేల్చారు. అందుకోసం తనను సంప్రదించారని వివరించారు. వారిద్దరిని టార్గెట్ చేసేందుకు పనిచేస్తే రూ.100 కోట్లు ఇస్తానని చెప్పారని వివరించారు. అడ్వాన్స్‌గా రూ.5 కోట్లు పంపించారని స్పష్టం చేశారు. తాను బౌరింగ్ క్లబ్ రూమ్ నంబర్ 110లో ఉన్న సమయంలో ఒకరిని పంపించారని తెలిపారు.

**అంతా డీకే చేశారు..** కుమారస్వామి సోదరుడి కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ డ్రైవర్ కార్తీక్ గౌడ నుంచి డీకే శివకుమార్ పెన్ డ్రైవ్ పొందారని దేవరాజే గౌడ సంచలన ఆరోపణలు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ వీడియోల వివాదం అయ్యేందుకు కారణం శివకుమార్ అని స్పష్టం చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ వీడియో వ్యవహారం వైరల్ అయిన ఘటనలో డీకే శివకుమార్ సహా ముగ్గురు మంత్రులు ఎన్ చెలువరాయస్వామి, కృష్ణ బైరె గౌడ్, ప్రియాంక్ ఖర్గే పాత్ర ఉందని దేవరాజే గౌడ ఆరోపించారు.

**కక్ష గట్టి కేసు...** 'శివకుమార్ చెప్పిన పని చేసేందుకు తాను అంగీకరించలేదు. తనపై కక్ష గట్టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు లభించకపోవడంతో మరో కేసు పెట్టారు. లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. డీకే శివకుమార్ రూ.100 కోట్లు ఇస్తాననే డీల్‌కు సంబంధించి ఆడియో రికార్డింగ్స్ తన వద్ద ఉన్నాయి. ఆ ఆడియో రికార్డింగ్స్ రిలీజ్ చేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుంది. స్కాండల్ కేసుకు సంబంధించి సిట్ మీద తనకు నమ్మకం లేదు. సాక్ష్యాధారాలను సీబీఐకి మాత్రం అందజేస్తాను. తన వద్ద ఉన్న వీడియోలు విడుదలైన వాటికి భిన్నంగా ఉన్నాయి అని' దేవరాజే గౌడ వివరించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




హైదరాబాద్: తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీ సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,40, 618 మంది విద్యార్థులు.. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 91,633 మంది విద్యార్థులు హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీలో 89 శాతం.. ఇంజినీరింగ్ విభాగంలో 74.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో మొదటి రెండు ర్యాంకులు ఏపీ విద్యార్థులు సాధించడం విశేషం.

**ఇంజినీరింగ్‌లో ర్యాంకులు..** మొదటి ర్యాంకు-ఎస్.జ్యోతిరాదిత్య(శ్రీకాకుళం-పాలకొండ) రెండో ర్యాంకు-హర్ష(కర్నూలు-పంచలింగాలు) మూడో ర్యాంక్-రిషి శేఖర్ శుక్లా(సికింద్రాబాద్-తిరుమలగిరి) నాలుగో ర్యాంకు-సందేశ్(హైదరాబాద్-మాదాపూర్) ఐదో ర్యాంకు-సాయి యశ్వంత్ రెడ్డి(కర్నూలు) ఆరో ర్యాంకు- పుట్టి కుశల్ కుమార్(అనంతపురం-ఆర్కేనగర్) ఏడో ర్యాంకు- హుండికర్ విదీత్(హైదరాబాద్-పుప్పాలగూడ) ఎనిమిదో ర్యాంకు-రోహన్(హైదరాబాద్-ఎల్లారెడ్డి గూడ) తొమ్మిదో ర్యాంకు-కొంతేమ్ మణితేజ(వరంగల్-ఘన్‌పూర్) పదో ర్యాంకు-ధనుకొండ శ్రీనిధి(విజయనగరం)

**అగ్రికల్చర్, ఫార్మసీలో ర్యాంకులు..** మొదటి ర్యాంకు-ప్రణీత(మదనపల్లె) రెండో ర్యాంకు-రాధాకృష్ణ(విజయనగరం) మూడో ర్యాంకు-శ్రీవర్షిణి(హనుమకొండ) నాలుగో ర్యాంకు-సాకేత్ రాఘవ్(చిత్తూరు) ఐదో ర్యాంకు- సాయి వివేక్(హైదరాబాద్-ఆసిఫ్‌నగర్) ఆరో ర్యాంకు-మహమ్మద్ అజాన్‌సాద్(హైదరాబాద్-నాచారం) ఏడో ర్యాంకు-వడ్లపూడి ముకేశ్ చౌదరి(తిరుపతి-వెంగమాంబపురం) ఎనిమిదో ర్యాంకు-భార్గవ్ సుమంత్(హైదరాబాద్-పేట్‌బషీరాబాద్) తొమ్మిదో ర్యాంకు-జయశెట్టి ఆదిత్య(హైదరాబాద్-అల్విన్ కాలనీ) పదో ర్యాంకు-దివ్యతేజ(శ్రీసత్యసాయి జిల్లా-బలిజపేట)




హైదరాబాద్: మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేశారంటూ జరుగుతున్న ప్రచారాన్ని హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు ఖండించారు. మెట్రో రాకపోకల్లో ఎలాంటి మార్పు చేయలేదని, యథావిధిగానే ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటల వరకు, ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటల నుంచే రైళ్ల రాకపోకలపై పరిశీలన మాత్రమే జరిగిందని, ఇంకా ఆ వేళలపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ, రైళ్ల, ట్రాక్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులెవరూ మెట్రో రైళ్ల సమయం విషయంలో అయోమయానికి గురికావొద్దని, యథావిధిగా నిర్దిష్ట సమయానికే రాకపోకలు ఉంటాయన్నారు.




తెలుగు రాష్ట్రాల్లో వర్షం స్వల్ప విరామం ఇచ్చిన నేపథ్యంలో ఈరోజు సాయంత్రం తర్వాత హైదరాబాద్‌లో మళ్లీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, శంకర్‌పల్లె ప్రాంతాల్లో భారీ వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతోపాటు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ అంచనా వేసింది. అంతేకాదు నైరుతి బంగాళాఖాతంలో ఈనెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పింది. ఇది మే 24 నాటికి వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈనెల 23 వరకు ఏపీ, తెలంగాణ లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఈ క్రమంలో కోస్తాంధ్ర, తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వానలు కురిచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. దీంతోపాటు వానల సమయాల్లో ప్రయాణాలు చేసే ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు.

## కాంగ్రెస్ వస్తే రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారనడం దారుణం



హైదరాబాద్: ప్రధాని మోదీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నాడని.. కాంగ్రెస్ వస్తే రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారనడం దారుణమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మోదీ విశ్వాసాలను రెచ్చగొట్టుతున్నాడని.. ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. రామాలయం దేవాలయ గేట్స్ తెరిచింది రాజీవ్ గాంధీయే అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టు తీర్పును గౌరవించి హిందువుల మనోభావాలు గౌరవించే విధంగా రామ్ లల్లా గేట్స్ తెరిచింది రాజీవ్ గాంధీయేనని జీవన్ రెడ్డి వెల్లడించారు. దేవాలయ గేట్స్ తెరిచినప్పుడు మోదీ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. "1989 శిలన్యాస్ చేశారు.. అప్పుడు ప్రధాని రాజీవ్ గాంధీ. గుడి శంకుస్థాపనకి అనుమతి ఇచ్చింది రాజీవ్ గాంధీ. 1989లో రాజీవ్ గాంధీ అధికారంలోకి వస్తే అప్పుడే రామాలయం పూర్తి అయ్యేది. బీజేపీ ఎన్నికల కోసం గుడిని వాడుకోవడం వల్లనే వివాదం. దేశంలో మత విశ్వాసాలు రెచ్చగొట్టడంతో ఈ అంశం తీవ్రం అయ్యింది. దేశంలో ధార్మిక చింతనను పెంపొందించింది రాజీవ్ గాంధీ. ఆయన పీఎంగా ఉన్నపుడు దూరదర్శన్‌లో రామాయణ, మహా భారతాలు ప్రసారమయ్యాయి. ఆదర్శ దేవుడిగా.. పాలనలో ప్రజాభిప్రాయాన్ని విలువని ఇచ్చింది శ్రీరాముడు. దూరదర్శన్‌లో ఎవరి ఆలోచన విధానానికి అనుగుణంగా టెలికాస్ట్ అయ్యాయి? హిందువుల మనోభావాలు గౌరవించేది గాంధీ కుటుంబం. సెక్యులరిజం అంటే అందరి భావలను గౌరవించడమే" అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

## 10 ఏళ్లలో 31వేల కి.మీ రైల్వే మార్గం నిర్మాణం: అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: ముంబయిలో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వివిద దేశాల రాయబారులకు గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మోదీ హయాంలో భారతీయ రైల్వేలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు పలు వివరాలను వెల్లడించారు. భారత రైల్వేలు భారీ స్థాయిలో నెట్‌వర్క్‌లను ఎలా కలిపాయి. ఏ విధంగా ఆధునీకరించాయో తెలిపారు. వివిధ దేశాల రాయబారులతో ఆయన మాట్లాడుతూ"ప్రస్తుతం దేశంలో రోజుకు 4కి.మీ రైలు ట్రాక్ నిర్మిస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 5,300 కి.మీ రైళ్ల నెట్‌వర్క్‌ను నిర్మించాము.

ఇది స్విట్జర్లాండ్‌లోని మొత్తం రైళ్ల నెట్‌వర్క్‌కు సమానం. పది ఏళ్లుగా 31,000 కి.మీ. ట్రాక్‌ను ఏర్పాటు చేశాము. ఇప్పుడు ఈ రైల్వే లైను జర్మనీలో మొత్తంలో ఉన్న పూర్తి నెట్‌వర్క్‌కు సమానం"అని ఆయన వివరించారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో 20,000 కిలోమీటర్ల మార్గాలను మాత్రమే నిర్మించిందని కాగా పదేళ్ల పాలనలో కేంద్రం ప్రభుత్వం 44,000 కిలోమీటర్ల రైల్వేనెట్‌వర్క్‌లకు విద్యుత్ సదుపాయాలు కల్పించిందని తెలిపారు. నేడు మనం రైల్వేల్లో 100 శాతం విద్యుదీకరణ దిశగా పయనిస్తున్నామన్నారు. "దేశంలో అతిపెద్ద ప్రజా రవాణా సంస్థ రైల్వేలు గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి చెందకుండా మిగిలిపోయాయి. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో రైల్వే అభివృద్ధి మొదలయ్యింది"అని ఆయన చెప్పారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ,ఆధునిక రైళ్ల తయారీ గురించి వివరించారు. దేశవ్యాప్తంగా 300 కంటే ఎక్కువ రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి జరిగిందన్నారు. కేవలం మహారాష్ట్రలోనే 120 స్టేషన్లు ఉన్నాయని, శివాజీ మహారాజ్ రైల్వే స్టేషన్ అత్యాధునిక సౌకర్యాలున్న స్టేషన్‌కు ఉదాహరణ అని పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660